క్లుప్తంగా

'అగ్ని అస్త్రం'తో పురుగుల నివారణ

బలిజిపేట: మొక్కజొన్నకు సోకిన కత్తెర పురుగు నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తయారు చేసిన అగ్ని అస్త్రం ద్రావణం ఉపయోగపడుతుందని ఏపీసీఎన్ఎఫ్ మండల ఇన్‌చార్జి లక్ష్మి అన్నారు. వెంగళరాయపురంలో అగ్ని అస్త్రం తయారీపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించి ద్రావణానిన తయారు చేశారు. దీని వల్ల పచ్చ పురుగు, కాండం తొలుచు పురుగు, కత్తెర పురుగు తదితర పెద్ద పురుగుల నివారణకు అన్ని రకాల పంటల్లో వినియోగించవచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గడువులోగా మస్తరు వేయించుకోవాలి



మస్తరు రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సీతానగరం: ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు నిర్దేశించిన సమయంలోగా మేట్‌లతో మస్తరు వేయించుకోవాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. వెంకటాపురం, నీలకంఠాపురం గ్రామాల్లో పనులు చేస్తున్న ఉపాధి వేతనదారుల మస్తరును ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్ కార్డులున్న వారందరికీ పనులు కల్పిస్తామన్నారు. ఇందుకు వేతనదారులు సిద్ధం కావాలన్నారు. అపరాల మొక్కల తీత పనుల్లో వేతనదారులు నిమగ్నం కావడం వల్ల ఉపాధి పనులకు వేతనదారుల హాజరు తగ్గిందని, దీంతో సాంకేతికపరమైన ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఆయన వెంట టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను పంచాయతీ కార్యదర్శులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ ప్రసాద్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల్లో ఇప్పటి వరకు జరిగిన పనులు, చేపట్టనున్న పనులు, అసంపూర్తిగా నిలిచిన పనులపై శుక్రవారం సమీక్షించారు. పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన పశువైద్య ఆరోగ్య శిబిరాలు



జగన్నాథపురంలో పశు వైద్యసేవలందిస్తున్న ఏడీ శ్రీనివాసరావు

పార్వతీపురం టౌన్: పాడి రైతులకు మేలు చేయాలన్న ఉద్దేశంతో నిర్వహించిన పశువైద్య ఆరోగ్య శిబిరాలు శుక్రవారంతో ముగిసాయని పశువైద్య శాఖ ఏడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. పార్వతీపురం మున్సిపాల్టీ జగన్నాథపురంలో ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. పలు పశువులకు మందులు వేశారు. శిబిరంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఆర్.పద్మావతి, గోపాలమిత్రలు మోహనరావు, ఖాన్, ఇతర పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు. పెదబొండపల్లి పంచాయతీలో పశువులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పశు వైద్యాధికారి భోగి చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూపరాణి

మక్కువ: మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో శుక్రవారం ఉపాధి పనులు ప్రారంభించినట్లు ఏపీఓ ఈశ్వరమ్మ తెలిపారు. మండలంలో అన్ని పంచాయతీలకు చెందిన 3,254 మంది వేతనదారులతో ఉపాధి పనులు జరిపించినట్లు ఆమె తెలిపారు. ఆయా పంచాయతీలు పరిధిలో భూ అభివృద్ధి పనులు, ఫారం పాండ్స్ ట్రెంచ్ పనులు, కాలువలు, చెరువుల పనులు జరిపిస్తున్నామన్నారు. కవిరిపల్లి గ్రామ సమీపంలోనీ తుమ్మికుల బందలో ఎంపీడీఓ స్వరూపారాణి వేతనదారుల మస్తర్లను పరిశీలించారు. పని ప్రదేశం వద్ద తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పనికి తగ్గ వేతనం ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి ఈఈగా సుబ్బారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం డివిజన్ ఆర్ అండ్‌బీ ఇన్‌చార్జి ఈఈగా కె.సుబ్బారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం సాలూరు ఆర్అండ్‌బీ డీఈఈగా విధులు నిర్వహిస్తున్నారు. పార్వతీపురం ఈఈ పోస్టు ఖాళీగా ఉండంతో ఈయనను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



పశువులు ఈనిన తరువాత దూడలను సంరక్షించేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. పుట్టిన తరువాత రెండు నెలల వరకు మరణాల శాతం ఎక్కువగా ఉంటుంది. పుట్టిన తరువాత వ్యాక్సిన్‌లు వేయించడంతో పాటు దూడకు అవసరమైన ముర్రపాలను అందిస్తే మరణాల శాతం గణనీయంగా తగ్గించవచ్చు. దూడలను కాపాడుకుంటే పశువులు వృద్ధి చెందుతాయి.
–డా. ఎస్.మన్మధరావు, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, పార్వతీపురం



ఆవు పాలు తాగుతున్న ఆవుదూడ

దూడల సంరక్షణతో పాడి రైతుకు మేలు

- పుట్టిన 60 రోజుల్లోపు మరణాల శాతం ఎక్కువ
- పశువు ఈనే ముందు, తరువాత జాగ్రత్తలు అవసరం

పార్వతీపురం:

నేటి పెయ్య దూడలే రేపటి పాడి ఆవులు అనే నానుడికి అనుగుణంగా... పుట్టిన ప్రతి దూడను పాడి రైతులు బతికించుకోవాల్సిన అవసరం ఉంది. సాధారణంగా పుట్టిన దూడల్లో 30 నుంచి 40 శాతం మరణిస్తూ రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయి. గేదె దూడల విషయానికి వస్తే చలికాలంలో 33 శాతం, వర్షాకాలంలో 31 శాతం, వేసవిలో 15 శాతం చనిపోతున్నట్లు ఒక నివేదిక చెబుతుంది. పుట్టిన తర్వాత 60 రోజుల్లోపు మరణాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ సమయంలో దూడల సంరక్షణ, పోషణ విషయంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. గర్భంతో వున్న పశువు ఈనే ముందు మూడు నెలలు, తర్వాత మూడు నెలలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మరణాల శాతాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు.

పాలే సంపూర్ణ ఆహారం..

పుట్టిన తర్వాత దూడల్ని తల్లి నుంచి ఒక రోజు లేదా నాలుగైదు వారాలు లేదా మూడు నెలల వయసులో వేరు చేస్తుంటారు. ఒక రోజు వయసులో వేరు చేసినపుడు వాటికి పాలు మాత్రమే సంపూర్ణం ఆహారం . దూడలకు ఇచ్చే పాలపాత్రలు, బాటిళ్లుగానీ శుభ్రంగా లేకపోతే విరేచనాలు అవుతాయి. దూడకు ఇచ్చే పాలు ఉష్ణోగ్రత శరీర ఉష్ణోగ్రతతో సమానంగా ఉండాలి. పాలు పట్టించేటప్పుడు బాటిల్ ద్వారా అయితే తల్లి పొడుగు ఎంత ఎత్తులో ఉంటుందో అంతే ఎత్తులో ఉంచి తాపించాలి. ఇలా తాగిస్తే పారుడు వ్యాధి రాకుండా నివారించవచ్చు.

అంటువ్యాధుల నిర్మూలన ఇలా...

దూడల్లో అంటువ్యాధుల నిర్మూలనకు ప్రణాళికాబద్ధంగా వైద్య చికిత్సలు చేయిస్తే మరణాల శాతాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. పుట్టిన మొదటి రోజు ధనుర్వాతం నివారణకు టెటనస్ టాక్రాయిడ్ మందు వేయించాలి. పుట్టిన ఏడో రోజు నట్టల నివారణకు పైపర్ జన్ అడిపేట్ 15 ఎం.ఎల్ ఇవ్వాలి. పుట్టిన ఆరు నుంచి ఎనిమిదో రోజు వరకు తెల్లపారుడు వ్యాధి నివారణకు 2 గ్రాములు నియోమైసిన్, ఆర్బీటెట్రాసైక్లిన్ ఇవ్వాలి. ఒకటో నెల నట్టల నివారణకు 20 ఎం.ఎల్ హైపర్ ఆన్ అడిపేట్, రెండో నెలలో 25 ఎం.ఎల్. మూడో నెలలో 25 ఎం.ఎల్ మందు తాగించాలి. 15 రోజుల తర్వాత బూస్టర్ డోస్ ఇవ్వాలి. తర్వాత ఆరు నెలలకు తిరిగి అదే మందు ఇవ్వాలి. నాలుగో నెలలో బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణకు బ్రూసెల్లోసీస్ వ్యాక్సిన్ జీవితకాలంలో ఒకసారి ఇస్తే సరిపోతుంది. నాలుగో నెలలోనే డైలేరియాసిస్ వ్యాధి నివారణకు సంకర జాతి దూడలకు 3 ఎం.ఎల్ రక్షా వ్యాక్సిన్ ఇవ్వాలి. ఇలా ఏడాదికి ఒకసారి ఇది ఇప్పించాలి. ఐదో నెల గొంతువాపు నివారణకు 3 ఎం.ఎల్ టీకా మందు ఇప్పించాలి. ఆరు నెలలకోసారి గొంతువాపు టీకా తప్పనిసరిగా ఇప్పించాలి. ఆరో నెల జబ్బవాపు నివారణకు మందు 3 ఎం.ఎల్. తాపించాలి. ఈ మందు ఏడాదికి ఒకసారి విధిగా రెండో నెల గాలికుంటు వ్యాధి నివారణలో భాగంగా ఇవ్వాలి.

వేరు చేసిన దూడల్లో మరణాలు

తల్లితో ఉన్న దూడల కన్నా వేరు చేసిన దూడల్లో మరణాల శాతం ఎక్కువగా ఉంటుంది. వేరు చేసిన దూడల్ని గాలి, వెలుతురు బాగా ప్రసరించే పరిశుభ్రమైన ప్రదేశాల్లో ఉండాలి. పరిశుభ్రత లేకుంటే ఊపిరితిత్తుల వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. వాటికిచ్చే ఆహారాన్ని అకస్మాత్తుగా మార్చడం వల్ల ఒత్తిడికి గురై తక్కువ ఆహారం తీసుకుంటాయి. దీనివల్ల వ్యాధి నిరోధకశక్తి తగ్గుతుంది. వేసవిలో పాకలో బయట ఉష్ణోగ్రత కన్నా వేడి తక్కువగా ఉండేలా చర్యలు చేపట్టాలి.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



మెటీరియల్ అందజేస్తున్న అధికారులు

మక్కువ: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ డీడీ స్వరూపరాణి అన్నారు. స్థానిక వెలుగు మహిళా సమాఖ్య భవనంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న వయోజన విద్య 143 మంది వలంటీర్లు వారి క్లస్టర్ పరిధిలోని నిరక్షరాస్యులను, అక్షరాస్యులుగా తీర్చే బాధ్యత తీసుకోవాలన్నారు. వలంటీర్లకు ఎంపీడీఓ స్వరూపారాణి, వెలుగు ఏపీఎం జయకుమార్ నిరక్షరాస్యులకు బోధన అందించే పుస్తకాలు, నోట్‌బుక్‌లు, తదితర సామగ్రి శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

నేడు మానవ హక్కులు-నైతిక విలువల పరీక్ష

పార్వతీపురం టౌన్: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మానవ హక్కులు - నైతిక విలువల పరీక్ష శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారిణి మంజులా వీణ తెలిపారు. స్థానిక డీవీఈఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ హక్కులు-నైతిక విలువలపై పరీక్ష నిర్వహించడానికి అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా 80 ప్రభుత్వ, ప్రైవేటు, వివిధ యాజమాన్యాల పరిధిలో ఉదయం 10గంటల నుంచి రాత్రి 1 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులంతా ఈ పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతు ఇవ్వండి



వంతరాం ఉన్నత పాఠశాల వద్ద ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ సభ్యులు

బలిజిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీడీఎఫ్ తరఫున ఎన్నికల బరిలో ఉన్న కోరెడ్ల విజయగౌరికి ఉపాధ్యాయులంతా మద్దతు ఇచ్చి విజయం చేకూర్చాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు కోరారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో బలిజిపేటలో ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని రక్షించేందుకు, ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం పోరాటం చేస్తున్న యూటీఎఫ్ సంఘంలో రాష్ట్ర స్థాయి పదవిని నిర్వహించిన అనుభవంతో ఇప్పుడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీడీఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచారన్నారు. ప్రచారంలో బి.రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లిడికివలసలో పాఠశాలను కొనసాగించాలి

పార్వతీపురం టౌన్: లిడికివలస గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని, గోచెక్క పాఠశాలలో విలీనం చేయాలనే ఆలోచన విరమించుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాడంగి సాయిబాబు అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విలీనం ద్వారా విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ సుందరరావు, గ్రామస్తులు బాడంగి రాము, ఉర్లక రాయప్ప తదితరులు ఉన్నారు.

అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

సీతానగరం: మండలంలోని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఈ ఏడాది మార్చి 8 వరకు అమల్లో ఉంటుందని తహసీల్దార్ ప్రసన్నకుమార్ వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అధ్యక్షతన ఎన్నికల నిబంధనలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు ఎన్నికల నిబంధనలు అమలయ్యేలా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఫ్లెక్సీలు, పోస్టర్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు. సమావేశంలో మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, వీఆర్‌ఓలు, పంచాయత కార్యదర్శులు పాల్గొన్నారు.

కోడ్ అమల్లోనూ వివక్ష

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికారులు కూటమి నేతల సేవలో తరిస్తున్నారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా ఎక్కడా పార్టీల ఫ్లెక్సీలుగాని, నాయకుల ఫ్లెక్సీలుగాని ఉండరాదు. అలాగే విగ్రహాలకు ముసుగు వేయాల్సి ఉంది. కానీ అధికార యంత్రాంగానికి ఇవేమీ పట్టడం లేదు. అధికార కూటమి నేతల ఫ్లెక్సీలు కోడ్ అమల్లోకి వచ్చినా ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నాయి. అదే సమయంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన వారి ఫ్లెక్సీలు తొలగించారు. విగ్రహాలకు ముసుగు వేశారు. దీనిపై ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. – సాక్షి నెట్‌వర్క్



సాలూరు: కోర్టుకు వెళ్లే దారిలో ఉన్న మంత్రి సంధ్యారాణి ఫ్లెక్సీలు



బలిజిపేట: చెరువు వద్ద ఉన్న ఫ్లెక్సీ



సాలూరు: వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేసిన అధికారులు



బలిజిపేట: ఉన్నత పాఠశాల వద్ద ఉన్న ఫ్లెక్సీ



సాలూరు: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న మంత్రి సంధ్యారాణి ఫ్లెక్సీలు

ఫీజుల దోపిడీపై నిరసన



కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టి, విద్యార్థుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బలిజిపేటలో శుక్రవారం విద్యార్థులు నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు భీమరాజు, మండల స్థాయి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. – బలిజిపేట

'ప్రేరణ'తో భయం పోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి మహమ్మద్ గయాజుద్దీన్

పార్వతీపురం టౌన్: విద్యార్థులకు పరీక్షలంటే భయం పోవాలనే ప్రేరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 ప్రీ మెట్రిక్, 5 పోస్టు మెట్రిక్ వసతిగృహాల్లో పదో, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. పరీక్షల్లో భయాన్ని పోగొట్టేందుకు సుశిక్షితులైన సబ్జెక్టు టీచర్లతో పరీక్షల్లో సులువుగా మార్కులు సాధించేందుకు మెలకువలను అందించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. గత సంవత్సరంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓలు పి.శ్రీకాంత్, పి.రాణి, ఉపాధ్యాయులు జోగారావు, ఆనందరాం, శివన్నారాయణ, వసతిగృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న ప్రోగ్రాం అధికారి జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: వసతిగృహ విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు సూచించారు. 16వ వార్డులో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం సందర్శించి విద్యార్థుల ఆరోగ్య వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. సిక్ రూమ్ తనిఖీ చేసి అక్కడ అనారోగ్య సమస్యతో ఉన్న విద్యార్థుల ఆరోగ్య స్థితి పరిశీలించారు. వారికి అందజేసిన చికిత్స, వైద్య పరీక్షల వివరాలపై వసతిగృహ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిక్ రూమ్‌లో మందులు తనిఖీ చేశారు. సిక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని వసతిగృహ వైద్య సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్‌లో ఏ విధమైన ఆరోగ్య సమస్యలు గుర్తించారు... సంబంధిత వివరాలపై వైద్య సిబ్బందిని ఆరా తీసి స్క్రీనింగ్ వివరాలు రికార్డులో పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఎవరికైనా ఆరోగ్య సమస్యలున్నాయా అని అడిగారు. చర్మ సంబంధిత సమస్యలు తెలియజేయగా వారిని పరిశీలించి ఏ విధమైన చికిత్స అందిస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగి విద్యార్థుల్లో గుర్తించిన ఆరోగ్య సమస్యలు నయమయ్యే వరకు ప్రత్యేక శ్రద్ధ చూపి పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.చిన్నమోహన్‌రాయుడు, ఎపిడెమిక్ ఈఓ సత్తిబాబు, వైద్య సిబ్బంది నారాయణమ్మ, హాస్టల్ వైద్య సిబ్బంది శ్రీరంజని, అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

పార్వతీపురం టౌన్: ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారణ సాధ్యమని ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు పేర్కొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. మానవ తప్పిదాల వల్లే 75 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పరిమితికి మించి వేగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమాలను ముమ్మరం చేసామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: జిల్లా విజిలెన్సు, పర్యవేక్షణ కమిటీలో గౌరవ సభ్యులుగా అధికారిక, అనధికారిక నియామకానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల/తెగల పీసీఆర్ అండ్ పీఓఏ చట్టం క్రింద జిల్లా విజిలెన్సు, పర్యవేక్షణ కమిటీ నందు గౌరవ సభ్యులుగా నియామకం చేపడుతున్నట్లు చెప్పారు. ఆసక్తి గల షెడ్యూల్డ్ కులముల, తెగల సోషల్ వర్కర్స్ నుండి షెడ్యూల్డ్ కులాలు, తెగల గ్రూప్‌-ఎ గెజిటెడ్ అధికారుల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగలకు చెందిన గ్రూప్‌-ఎ గెజిటెడ్ అధికారులు అధికారిక సభ్యులుగా ఇద్దరిని నియమించనున్నట్లు చెప్పారు. షెడ్యూల్డ్ కులముల, షెడ్యూల్డ్ తెగలకు చెందిన ముగ్గురిని అనధికారిక సభ్యులుగా తీసుకోనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తదుపరి వివరాల కోసం, పూర్తి దరఖాస్తుతో జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమ, సాధికారిత శాఖ, మెంబర్ కన్వీనర్, ఆర్‌సీఎం స్కూల్ బిల్డింగ్, ఎఫ్‌-1 ఫ్లోర్‌లో గల కార్యాలయాన్ని నేరుగా కార్యాలయ పని వేళలో లేదా 94925 35085 నంబరును సంప్రదించాలని సూచించారు.

రహదారి ప్రమాదాలపై అవగాహన

పార్వతీపురం టౌన్: జిల్లాలో వాహన చోదకులకు రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా రవాణ శాఖాధికారి ఎ.వరప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదకర మలుపుల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై వాహన డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రమాదకర మలుపుల వద్ద ద్విచక్ర, భారీ, అతిభారీ వాహనాల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. వీటిపై జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల వాహనచోదకులకు అవగాహన కల్పించామని తెలిపారు.